క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరిన రాజ్‌కుమార్



ములుగు: బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు, సంచార జాతుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాణాల రాజ్ రాజ్‌కుమార్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్‌ల సమక్షంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి సుధీర్‌యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు విజయ రాంనాయక్, బైకాని సాగర్, ముడుతనపల్లి మోహన్, దొడ్డి రఘురాం, గంట ఓదేలు తదితరులు పాల్గొన్నారు.

పోచంపల్లిని కలిసిన మహేష్‌నాయక్

ములుగు: నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిని సోమవారం పత్తిపల్లి ఎంపీటీసీ మహేష్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని అన్నారు. అనంతరం రెడ్ కో చైర్మన్ వై సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాకు వరాలు అందించిన సీఎం కేసీఆర్‌కు నాగజ్యోతి గెలిపించి కానుకగా ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, పిఎసిఎస్ డైరెక్టర్ అజ్మీరా ధరమ్ సింగ్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



వెంకటాపురం(కె): వెంకటాపురం తహసీల్దార్‌గా సమ్మయ్య సోమవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన సృజన్‌కుమార్‌ను ఏటూరు నాగారానికి బదిలీ కాగా, ఆయన స్థానంలో ములుగు కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సమ్మయ్యను ఇక్కడికి నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా సోమవారం తహసీల్దార్‌గా సమ్మయ్య బాధ్యతలను స్వీకరించారు.

ముందస్తు అరెస్ట్



ములుగు: తమను రెగ్యులర్ చేసి అన్ని రకాల బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో రెండో ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు సోమవారం నిరసనలకు తరలి వెళ్లనున్న నేపథ్యంలో పోలీసులు ముందుస్తుగా అరెస్టు చేశారు. ఉదయం వారి ఇంటి వద్ద ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం సొంత పూచికత్తుపై వదిలేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

ఏటూరునాగారం: ఏటూరునాగారం పోస్టల్ కార్యాలయంలో ఈడీఎంసీ షాపెల్లి ప్రాంతంలో పనిచేస్తున్న సాబీర్ హుస్సేన్ సోమవారం రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన సాబీర్ మండలంలోని చిన్నబోయినపల్లి నుంచి ఏటూరునాగారం వస్తున్నాడు. పెట్రోల్ బంక్ వద్ద బొలెరా వాహనం ఒక్కసారిగా రావడంతో సాబీర్ వాహనం అదుపుతప్పి బొలెరోను ఢీ కొట్టింది. దీంతో సాబీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ఆస్పత్రి తీసుకెళ్లి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు. వైద్య ఖర్చుల కోసం దాతలు ముందుకు వచ్చి సాబీర్ కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని తోటి ఉద్యోగి వహీద్ 80964 38096 ఫోన్‌పే, గూగుల్ పే చేయగలరని కోరారు.

'చర్య తీసుకోవాలి'

కాటారం: కాటారం ఆర్డీఓ కార్యాలయం ప్రారంభోత్సవంలో ప్రోటోకాల్ పాటించని కాటారం తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. ఆర్డీఓ కార్యాలయం ప్రారంభోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే, ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానించాల్సిన తహసీల్దార్ సమాచారం ఇవ్వకపోవడం శోచనీయం అన్నారు. తహసీల్దార్ బీఆర్ఎస్ కార్యకర్తల వ్యవహరిస్తూ కేవలం ప్రారంభోత్సవానికి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులను మాత్రమే ఆహ్వానించి ప్రారంభించారని ఆరోపించారు. తహసీల్దార్‌ను తక్షణమే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో చెప్పుకోవడానికి కనీస వసతులు, ఆర్డీఓకు కుర్చీ లేకున్నా ఆర్డీఓ కార్యాలయాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు.

30 ఏళ్ల కల నెరవేరింది..

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు



ఫైరింజన్‌ను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు

ఏటూరునాగారం: ఏటూరునాగారం డివిజన్ కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటుతో 30 ఏళ్లుగా ఎదురు చూస్తున్న ప్రజల ఆకాంక్ష నెరవేరిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు అన్నారు. మండల కేంద్రంలో ఫైరింజన్‌ను ఆయన సోమవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించి మాట్లాడారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని 6 మండలాలకు ఫైర్ స్టేషన్ అవసరం ఉందని గత ప్రభుత్వాలకు పలుమార్లు మొరపెట్టుకున్నామన్నారు. కానీ బీఆర్ఎస్ పాలనలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో ఈ ఫైర్ స్టేషన్ మంజూరు అయిందని తెలిపారు. గత ఏడాది మంగపేటలో ఫైరింజన్ సకాలంలో రాకపోవడంతో శనిగకుంట గ్రామం అగ్నికి ఆహుతి అయిందని తెలిపారు. ప్రజలు ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే 101కు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం భూపాలపల్లిలోని ఉన్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని లక్ష్మీనర్సింహారావు, బీఆర్ఎస్ నాయకులు తాడూరి రఘు తదితరులు కలిసి ఘనంగా సన్మానించారు. మరో నాలుగు నెలల్లో ఏటూరునాగారానికి ఆర్టీసీ బస్సు డిపో కూడా ఇస్తానని శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు లక్ష్మీనర్సింహారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, మండల పార్టీ అధ్యక్షుడు సునీల్‌కుమార్, ఎంపీటీసీలు కోట నర్సింహులు, కుమ్మరి స్వప్న, నాయకులు తుమ్మ మల్లారెడ్డి, ప్రదీప్‌రావు, వలిబాబు, కూనూరు మహేష్, ధన్నపునేని కిరణ్, బాస పుల్లయ్య, తాడూరి రఘు, ఖాజాపాషా, నాగసాగర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

101కు సమాచారం ఇవ్వాలి

మండల కేంద్రంలోని అగ్నిమాపక కార్యాలయాన్ని ములుగు, భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల అగ్నిమాపక అధికారి ఖరీముల్లాఖాన్ సోమవారం ప్రారంభించారు. ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే 101 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే ఇక్కడి అధికారులు, సిబ్బంది నంబర్లు కూడా ఇస్తామని తెలిపారు.



ఫైర్ స్టేషన్ ఇచ్చినందుకు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న లక్ష్మీనర్సింహారావు

కొనసాగుతున్న హెరిటేజ్ వలంటీర్ క్యాంపెయిన్



చింతలమోరి గూడేన్ని సందర్శిస్తున్న వలంటీర్లు

వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని రామప్ప సరస్సుకట్టపై కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ క్యాంపెయిన్ సోమవారం 8వ రోజుకు చేరుకుంది. ఉదయం 6గంటలకు యోగ గురువు రాంబాబు రెండు గంటల పాటు వలంటీర్లకు యోగాలో శిక్షణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా సోమవారం లక్నవరం, మేడారం సమ్మక్క–సారలమ్మ దేవతలను వలంటీర్లు దర్శించుకున్నారు. అనంతరం తాడ్వాయి మండల పరిధిలోని చింతలమోరి గొత్తికోయ గూడాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజనులు కొమ్ముకోయ నృత్యాన్ని ప్రదర్శించగా వలంటీర్లు తిలకించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు శ్రీధర్‌రావు, టూరిజం అసిస్టెంట్ ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్, టూరిజం స్కాలర్స్ కొక్కుల ప్రశాంత్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ఏటూరునాగారం: చెక్కు ఇస్తున్న నాయకులు



మహదేవపూర్‌లో..

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన దడిగల సాయితేజ అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. వైద్య ఖర్చుల నిమిత్తం బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, రోడ్లు భవనాల శాఖ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధితుడి తండ్రి సత్యంకు సోమవారం మండల కేంద్రంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, మండల పార్టీ అధ్యక్షుడు సునీల్‌కుమార్, తమ్మ మల్లారెడ్డి, ఖాజా, ప్రదీప్‌రావు, కోట నర్సింహులు, తాడూరి రఘు, వలిబాబా, సమ్మయ్య, శంకర్, రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

మహదేవపూర్: మండలంలోని రాపెల్లి కోట గ్రామనికి చెందిన ఇద్దరికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. గ్రామనికి చెందిన కాత్రెవుల నాగమణికి రూ.60,000, జగరి తిరుపతికి రూ.10000 విలువ గల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గట్టయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలను అడ్డుకుంటున్న అధికార పార్టీ



గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న కీర్తిరెడ్డి

భూపాలపల్లి రూరల్: సింగరేణిలో కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలను అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ అడ్డుకుంటుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి ఆరోపించారు. సోమవారం కేటీకే ఒకటవ గని ఆవరణలో బీఎంఎస్ పిట్ కార్యదర్శి ఓరం లక్ష్మణ్ ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌కు బీఎంఎస్ భూపాలపల్లి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్‌తో కలిసి కీర్తిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణిలో జరుగుతున్న పరిణామాలపై కార్మికులకు కూలంకషంగా వివరించారు. సింగరేణిలో అధికార పార్టీ రాజకీయ జోక్యంతో సంస్థను అమ్మకానికి సిద్ధపడ్డారన్నారు. రానున్న రోజులలో బీఎంఎస్ యూనియన్‌ను కార్మికులు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. టీబీజీకేఎస్ యూనియన్ నాయకులు అధికారుల వద్ద పైరవీలకే పరిమితమై కార్మికులకు సంబంధించిన ఏ ఒక్క సమస్య పట్టించు కోవడం లేదన్నారు. అప్పాని శ్రీనివాస్ మాట్లాడుతూ... టీబీజీకేఎస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరుకు సంస్థలో కార్మికుల ఆత్మ గౌరవం దెబ్బతిన్నదన్నారు. బీఎంఎస్ నాయకులు అల్లం శ్రీనివాస్, భాస్కర్, లక్పతి, బ్రాంచ్ కార్యదర్శి సుజేందర్, ఈర్ల సదానందం, రంగనాయకుల జనార్థన్, దామోదర్, నర్సింగరావు, మల్లారెడ్డి, మొగిలి కుమారస్వామి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కాటారం: ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు పలు విభాగాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 17 ఖోఖో విభాగంలో పి.తేజస్, అండర్ 19 హ్యాండ్ బాల్ విభాగంలో టి.జితేందర్, నరేశ్, వంశీ, శేశు అనే విద్యార్థులు ఈ నెల 8న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. దీంతో విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ రమేశ్, పాఠశాల పీడీ మంథెన శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 13 నుంచి 15 వరకు మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో ఎంపికైన విద్యార్థులు పాల్గొంటారని వారు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ జేకె.బుచ్చయ్య, వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్, పీడీ శ్రీనివాస్, పీఈటీ సతీశ్, కోచ్ వెంకటేశ్ అభినందించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

భూపాలపల్లి రూరల్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అక్టోబర్ 15, 16, 17వ తేదీలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక మహాసభలకు జిల్లాలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనిడెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ భూపాలపల్లి జిల్లా సీనియర్ నాయకుడు దేవదాసు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం భూపాలపల్లి మండలంలోని గోర్లవీడు ఉన్నత పాఠశాలలో మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను మధ్యాహ్న భోజన సమయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ సంఘం జిల్లా నాయకుడు జయప్రకాష్, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు నవనీత్, వంశీ, వాసుదేవ్, మాలతీ, సుధాకర్ రెడ్డి, రఘుపతి, సదాశివుడు, మేరీ బాయ్, సునీత, మమత తదితరులు పాల్గొన్నారు

స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నూతనంగా ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణం కోసం చదును చేసిన స్థలాన్ని ములుగు ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి సోమవారం పరిశీలించారు. నూతనంగా డీఎంఎఫ్‌టీతో ద్వారా రూ.60 లక్షలు మంజూరు కాగా పనులు కూడా చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యాలయం చుట్టూ ప్రహరీ కూడా నిర్మించాలని డీటీ నితిన్, ఆర్ఐ శ్రీనివాస్‌లు ఆర్డీఓకు వివరించారు. స్థలం చుట్టూ పక్కాగా హద్దులు వేయించాలన్నారు. భవిష్యత్ తరాలకు సరిపోయే విధంగా భవన నిర్మాణం చేపట్టాలన్నారు. భవన నిర్మాణం కోసం చేసిన మార్కింగ్‌ను పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట డీటీ నితీష్, ఆర్ఐ శ్రీనివాస్, జూనియర్ రాములు, సిబ్బంది కిరణ్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఐటీడీఏ క్రాస్ వద్ద పోలీసులు వాహనాలను సోమవారం తనిఖీ చేశారు. హెడ్ కానిస్టేబుల్ రామారావు, సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేసి అందులో ప్రయాణిస్తున్న వారి వివరాలను సేకరించారు. ప్రతి వాహనదారుడు ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. మావోయిస్టుల ప్రాంతం కావడంతో ముందస్తుగా పోలీసులు తనిఖీలు చేసి అప్రమత్తం అయ్యారు.

కాన్షీరాం జీవితం ఆదర్శం

కాటారం: బహుజనుల రాజ్యాధికారం కోసం అహర్నిషలు కృషి చేసిన కాన్షీరాం జీవితం ఆదర్శమని బీఎస్పీ మండల అధ్యక్షుడు బొడ్డు రాజబాబు అన్నారు. మాన్యశ్రీ కాన్షిరామ్ వర్ధంతిని బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ.. బహుజనుల బతుకులు మార్చడం కోసం కాన్షిరాం అతడి కుటుంబాన్ని వదులుకొని జీవితాన్ని త్యాగం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు, బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ మౌలానా, సెక్టార్ అధ్యక్షుడు బీరెల్లి మహేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

రాజీనామా

కాటారం: బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం కాటారం మండల అధ్యక్షురాలు ఎలుబాక సుజాత తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా తెలంగాణ జాగృతి విభాగంలో క్రియాశీలకంగా పని చేశానని తదనాంతరం బీఆర్ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలిగా సమర్థవంతంగా పని చేస్తూ వచ్చినట్లు తెలిపారు. ఇటీవల పార్టీలో సముచిత గౌరవం, పార్టీ కార్యాక్రమాలకు సమాచారం ఇవ్వకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైనట్లు తెలిపారు. దీంతో అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు వివరించారు. తన రాజీనామా పత్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షురాలికి పంపించినట్లు తెలిపారు.

నేటి నుంచి ఆటల పోటీలు

భూపాలపల్లి రూరల్: సద్దుల బతుకమ్మ పండుగ ఉత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ క్రీడా మైదానంలో ఈనెల 11నుంచి 13వరకు సింగరేణి ఉద్యోగుల మహిళలకు, మహిళా ఉద్యోగులకు, స్థానిక ప్రజలకు ఆటల పోటీలు నిర్వహిచనున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి అజ్మీరా తుకారాం సోమవారం ప్రకనటనలో తెలిపారు. తగ్‌ఆఫ్‌వార్, బాల్ పాసింగ్, త్రో బాల్, పిల్లలకు పరుగు పందెం ఆటలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు ఈనెల 18 ఫ్యామిలీ డే రోజున ఏరియా జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాస రావు చేతుల మీదుగా బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు. రామప్ప కా లనీ, 1000 క్వార్టర్స్ వాసులకు 11న తౌజండ్ క్వార్టర్స్ ఫంక్షన్ హాల్‌లో, కృష్ణ కాలనీ, సుభాష్ కాలనీ వాసులకు 12వ అంబేడ్కర్ స్టేడియంలో ఆటలను నిర్వహించనున్నట్లు తెలిపారు. జీఎం ఆఫీస్, ఏరియా ఆస్పత్రి ఉద్యోగులకు 13న స్థానిక మైన్స్ రెస్క్యూ స్టేషన్‌లో ఆటల పోటీలను నిర్వహిస్తామన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



అరెస్టు చూపుతున్న పోలీసులు

వాజేడు: మండల పరిధిలోని చింతూరు గ్రామంలోని గుడుంబా స్థావరాలపై సోమవారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు. చింతూరు గ్రామంలో గుడుంబా విక్రయిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు దాడులు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో 40 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కాగితాల దుర్గారెడ్డి, ములకల మోహన్‌రావు, ములక అర్జయ్యలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరితో పాటు గతంలో గుండుంబా కేసులో పట్టుబడిన వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

12న డివిజన్ స్థాయి క్రీడలు

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని మేడారంలోని ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఈనెల 12న ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు డివిజన్ స్థాయి క్రీడలు నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం సరోజన సోమవారం తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని ములుగు, గోవిందరావుపేట, వెంకటాపూర్, తాడ్వాయి మండలాల్లోని 20 ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లోని 14, 17 సంవత్సరాల బాలబాలికలకు ఖో–ఖో, కబడ్డీ, వాలీబాల్, చెస్, ఆర్చరీ, క్యారం, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు మాడె నాగేశ్వరరావు, పుల్సాం శ్రీనివాస్, సుతారి రమేష్, పీడీలు మేకల కృష్ణ, సమ్మయ్య, గడ్డం లక్ష్మీనారాయణ, చింత సతీష్, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

12న జోనల్ మీట్ క్రీడోత్సవాలు

ఏటూరునాగారం: ఐటీడీఏ ఏటూరునాగారం ట్రైబల్ స్పోర్ట్స్ మీట్ జోనల్ క్రీడోత్సవాలు ఈనెల 12న నిర్వహించనున్నట్లు క్రీడల ఇన్‌చార్జ్ సారంగపాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడల్లో ఏహెచ్ఎస్ బ్రహ్మణపల్లి, కోమటిపల్లి, ఆకులవారిఘణపురం, కన్నాయిగూడెం, ఏయూపీఎస్ ఏటూరునాగారం, తుపాకులగూడెం, ఐలాపురం, చెల్పాక, తాడ్వాయి ఈ నాలుగు మండలాల నుంచి ఆశ్రమ పాఠశాలలు చిన్నబోయినపల్లి ఏహెచ్ఎస్ క్రీడామైదానంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, చెస్, క్యారమ్, 14, 17 విభాగాల బాలబాలికలు నిర్వహించడం జరుగుతుందని క్రీడల కన్వీనర్ సారంగపాణి తెలిపారు.

పార్టీ జెండాల తొలగింపు



ఏటూరునాగారం: ఫ్లెక్సీ తొలగిస్తున్న జీపీ సిబ్బంది



జెండా తొలగిస్తున్న జీపీ సిబ్బంది

ఏటూరునాగారం: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ మేరకు మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు సిబ్బందితో సోమవారం గ్రామంలోని వివిధ రాజకీయ పార్టీల జెండాలను తొలగించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, డీఎస్పీ తదితర రాజకీయ పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లను రోడ్ల వెంట, డివైడర్లకు, కరెంటు స్తంభాలకు కట్టి ఉండడంతో వాటిని తొలగించి జీపీ కార్యాలయానికి తరలిస్తున్నారు.

కాటారం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలో సోమవారం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల అధికారులు మండలంలో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు పర్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా కాటారం గ్రామపంచాయతీ పరిధిలోని ప్రధాన కూడలిలో పలు పార్టీలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలను పంచాయతీ కార్యదర్శి ఫగీర్ ఖాన్ ఆధ్వర్యంలో సిబ్బంది తొలిగించారు. ఫ్లెక్సీలు, బ్యానర్లు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

విద్యతోనే సమాజ అభివృద్ధి



పుస్తకాలు, బ్యాగులు అందజేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎస్టీయూ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆట సదయ్య అన్నారు. ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, వరదలకు కొట్టుక పోయిన ఇళ్లు, మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బోర్డులు, క్రీడా సామగ్రి, విద్యార్థులకు దుస్తులు, నోట్ పుస్తకాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతలో ఎస్టీయూ ఎల్లవేళలా ముందు ఉంటుందని, గతంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్, వెంకన్న, అధ్యక్షుడు వేమునూరి రాంబాబు, ప్రధాన కార్యదర్శి కామగోని రాంబాబు, సోలం కృష్ణయ్య, నాగరాజు, అల్లోజు కిషన్, మంచర్ల టీవీ వీరభద్రం, రాంబాబు, వెంకన్న, రవి పాల్గొన్నారు.

శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న సర్పంచ్, ఉపసర్పంచ్

కాటారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి ఎదురుగా జాతీయ రహదారిపై చత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణానికి సర్పంచ్ తోట రాధమ్మ, ఉపసర్పంచ్ నాయిని శ్రీనివాస్ సోమవారం భూమి పూజ చేశారు. చత్రపతి శివాజీ గొప్ప పరిపాలన దక్షకుడు అని ఆయన పరిపాలన విధానం నేటి సమాజానికి ఆదర్శప్రాయం అన్నారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం మండల అధ్యక్షుడు తోట కోటేశ్వర్, వార్డు సభ్యుడు తైనేని సతీశ్, మానెం రాజబాబు, గోనె రవి, మాచెర్ల రాజేందర్, పసుల శంకర్, చీమల రాజు, గొరోజు రోశయ్య, పసుల శంకర్, గోనె మహేశ్, రమేశ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్, మిల్లింగ్ చార్జీలు ఇప్పించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి జిల్లా కేంద్రానికి విచ్చేసిన మంత్రి కేటీఆర్‌ను రైస్‌మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోరే రమేష్ ఆధ్వర్యంలో రైస్ మిల్లర్లు ట్రాన్స్‌పోర్ట్, మిల్లింగ్ చార్జీలు ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రిని సన్మానించారు. 2022–23 ఖరీఫ్ సీజన్‌కు జిల్లాలోని 26 రైస్ మిల్లులకు సివిల్ సప్లయ్ కార్పొరేషన్ వారు సేకరించిన ధాన్యము, 1001 వెరైటీ తడిసిన ధాన్యము దిగుమతి చేసుకొని ప్రభుత్వానికి సహకరించామన్నారు. తమ మిల్లర్లకు రావల్సిన ట్రాన్స్‌పోర్ట్, మిల్లింగ్ చార్జీలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోరా రైస్ 200 ఏసీకే, బాయిల్డ్ రైస్ 500 ఏసీకేకు సివిల్ సప్లయ్‌చేసేందుకు నిల్వలున్నాయని అనుమతులు ఇప్పించాలని కోరారు.